# రేడియో ధారావాహిక - అవని వసంతం

## అంకం - 06

**XXX**

**రచన – మూలం : నవనీత్ కుమార్ గుప్తగారి "లెట్స్ కమ్ ఎగైన్"**

**స్వేచ్ఛానువాదం : షేక్ గౌస్‌బాష, అధ్యాపకులు**

**× × ×**

## పాత్రలు

| | | | |
|---|---|---|---|
| (1) | విజయ్ (వి) | .. | తండ్రి (45) |
| (2) | భారతి (భా) | .. | తల్లి (40) |
| (3) | మనస్వి (మ) | .. | కుమార్తె – విద్యార్థిని (17) |
| (4) | సార్థక్ (సా) | .. | కుమారుడు – విద్యార్థి (15) |
| (5) | డా॥ సింధు (సిం) | .. | భారతి అక్కగారు, పర్యావరణవేత్త, యు.ఎన్.ఓ. సలహాదారు, అమెరికా నివాసి |

---

**టైటిల్ పాట – సిగ్నేచర్ పాట**

---

ఈ అంకంలో మన్నికైన అభివృద్ధి గురించి చర్చిస్తాము. మన చుట్టూ ఉండే పరిసరాలను, వాతావరణాన్ని, నివాస యోగ్యతను విధ్వంసం చేయనటువంటి అభివృద్ధి కావాలి. భూగ్రహాన్ని అందులోని జీవావరణాన్ని, జీవరాశి లాంటి సమస్త విషయాలను కాపాడుకొంటూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలనే సానుకూల సంకల్పం గురించి ఈ అంకం ప్రస్తావిస్తుంది.

---

## దృశ్యం

రాష్ట్ర రాజధాని అమరావతిలో విజయ్ కుటుంబం ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకోటానికి, అమెరికాలో నివాసం ఉండే డా॥ సింధుగారు అమెరికానుండి అమరావతిలో వున్న విజయ్ ఇంటికి వచ్చియుంటారు. కుటుంబ సభ్యులందరూ ఒకేచోట కూర్చొని మాట్లాడుకుంటూ ఉంటారు.

భా : అక్కా! రెండేళ్ళ తరువాత మళ్ళీ ఇక్కడ మాతో! చాలా సంతోషంగా ఉంది. అయినా నాకో సందేహం. మమ్మల్ని, ఈ దేశాన్ని వదిలామనే బాధ వుండదా నీకు? అసలు మేం గుర్తుంటామా నీకు?

సిం: (గారాబంగా) ఓ నా ముద్దుల చెల్లీ! స్వంత ఊరినీ, స్వంత వాళ్ళనూ, స్వంత దేశాన్ని ముఖ్యంగా నీలాంటి చెల్లిని వదులుకొని వెళ్ళినవారెవరైనా సంతోషంగా ఉంటారా? కాని తప్పదు. నా ఉద్యోగం అక్కడ. అవసరాలు అక్కడకు తీసుకెళ్ళాయి. పని ఒత్తిడిలో అన్నీ మరచి పోతాం. సమయం ఎలా గడిచిపోతుందో అర్థం కాదు.

సా: పెద్దమ్మా! మీరు న్యూయార్క్‌లో ఉంటే మమ్మల్నందరినీ మరిచిపోతారు. అంతేకదా?

మ: పెద్దమ్మా... పెద్దమ్మా! అందరూ తనలాగే ఉంటారని అనుకుంటాడు మా సార్థక్ (నవ్వేస్తుంది). వాడికి మీ పని వత్తిడి పట్టదు. వాడికి యు.ఎన్.ఓ. అంటే ఏంటో తెలీదు. అందులో ఉద్యోగం అంటే అవగాహన లేదు. పర్యావరణ అంశాలపై అంతర్జాతీయంగా మీరు చేస్తున్న కృషేంటో చూడడు. అస్సలు వాడికి పర్యావరణ పరిరక్షణ పట్టదు. అందుకే వాడటువంటి ప్రశ్నలు వేస్తుంటాడు.

వి: తల్లీ! చక్కగా చెప్పావ్. యు.ఎన్.ఓ.లో అతి ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తున్నపుడు సమయం దొరకడం చాలా కష్టం. క్షణం తీరిక దొరకదు. అర్థం చేసుకోవాలి భారతీ!

సా: (నవ్వుతూ) మీ వివరణతో నేను ఏకీభవించను గాక ఏకీభవించను. పెద్దమ్మ నిజంగా, చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ముందు మన ఇంటిని చక్కదిద్ది ఆ తర్వాత ఇతర దేశాల గురించి పట్టించుకోవాలి. ముందు మన దేశంలోని పర్యావరణం గురించి ముఖ్యంగా ఢిల్లీ గురించి ఆలోచించాలి.

భా: రేయ్ సార్థక్! నీ ఆలోచన తప్పురా! అందరం, అందరి కోసం ఆలోచించాలి. స్వార్థం ఉండకూడదు. "వసుధైక కుటుంబం। అనే మన సంస్కృతి చింతనని మరిచిపోతున్నాం. భూమాత అంటుంటాం, అంటే భూగ్రహాన్ని మన తల్లిలా చూస్తాం.

(సింధు, మనస్వి చప్పట్లు కొడ్తారు) (చప్పట్ల శబ్దం)

వి: మై డియర్ యంగ్ ఫ్రెండ్స్! మీ అమ్మగారు చెప్పింది అక్షర సత్యం. పర్యావరణ మనదే కాదు, ప్రపంచ ప్రజలందరి వారసత్వ సంపద. దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

సిం: విజయ్! బాగా చెప్పారు.

సా: నాన్నా! ఢిల్లీలో ఏం జరిగిందో మీకు తెలుసా? దీపావళి మరుసటి రోజు శ్వాస తీసుకోడానికి ప్రజలు కష్టపడ్డారట. పూర్తిగా కాలుష్యం. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదట.

సిం: సార్థక్! కేవలం ఢిల్లీలోనే ఈ సమస్య ఉందనుకుంటున్నావా? కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఈ సమస్య ఉంది.

భా: అక్కా! దీన్ని నిరోధించడానికి ఏదో ఒకటి చేయాలి కదా? కాలుష్యాన్ని అదుపులో పెట్టడానికి అన్ని రకాల చర్యలు చేపట్టాలి కదా!

వి: ఇది ఏ ఒక్కరితోనో పరిష్కారమయ్యేది కాదు. మొత్తం ప్రపంచ ప్రజానీకం కదలాలి. అందరం కలసి అడుగేయాలి. పర్యావరణ పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా ఉండాలి.

సా: అందుకే ఈ బాధ్యత పెద్దమ్మ తీసుకోవాలి. ఎందుకంటే ఆమె యు.ఎన్. ఉద్యోగి కదా! ఐక్య రాజ్య సమితి తీర్మానాలను అన్ని దేశాలు పాటించాలి కదా!

సిం: సార్థక్! నీకో విషయం అర్థం కావాలి. మనం మాట్లాడుకుంటున్న సమస్య ఒక వ్యక్తితోనో, ఒక దేశంతోనో పరిష్కారమయ్యేది కాదు. విజయ్ చెప్పినట్లు అందరం కలిసి కదలాలి. అభివృద్ధి మార్గాన్ని నేర్చుకోవాలి, మార్చుకోవాలి.

మ: ఎలా పెద్దమ్మా?

సిం: కొత్త మంత్రం. మన్నికైన అభివృద్ధి. సహజ వనరులను విధ్వంసం చేయకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలి.

మ: అవునా? తరచూ వింటున్నాం ఈ మాట.

సా: పెద్దమ్మా! మన్నికైన అభివృద్ధి అంటే...!

భా: ఓరి నా చిన్నా! క్రొత్త పద్ధతిలో అభివృద్ధి. సహజ వనరులను అవసరం మేరకే వినియోగించుకోవడం.

మ: మన అత్యాశలు తీర్చుకోడానికి అవసరాలకు మించి సహజ వనరులను వినియోగించ కూడదు.

వి: ఇదేమీ మనకు కొత్త కాదు. మన నాగరికత, సంస్కృతిలోనే ఉంది.

సా: నాన్నా! మీరిద్దరూ నన్ను తికమక పెడుతున్నారు. అమ్మేమో భవిష్యత్తు గురించి మాట్లాడుతోంటే మీరేమో నాగరికత – సంస్కృతి అని గతంలోకి తీసుకెళ్తున్నారు.

మ: సార్థక్! నీ కంతా తికమకే. తింగరోడివి. అమ్మ, నాన్నలను అర్థం చేసుకోవడం నీకు కష్టమే. పెద్దమ్మే నీకు సరైన గురువు. (పెద్దగా నవ్వేస్తుంది).

సా: అక్కా! (సీరియస్‌గా) ఆ విషయాన్నొదిలేయి. నాకేం కావాలో నీకర్థమయితే కదా! నీకే చాలాసార్లు వాళ్ళేం మాట్లాడుతున్నారో అర్థం కాదు.

భా: జెలసీ పనికిరాదు. ఇద్దరూ ఇద్దరే. పెద్దమ్మ ఏం చెబుతుందో అర్థం చేసుకోండి. మీరు గొడవ పడితే ఏం ప్రయోజనం? చెప్పండి.

సిం: సార్థక్! ఇందులో తికమక ఏమీ లేదు. ఇద్దరు చెప్పిందాంట్లోనూ నిజం వుంది. వారి వారి కోణాల్లో ఇద్దరూ సరిగానే చెప్పారు. నిలకడైన అభివృద్ధి అనేది ఏం చెప్తోందంటే గతం నుంచి నేర్చుకొని భవిష్యత్తు కొరకు వాస్తవిక ప్రణాళికలను వర్తమానంలో రూపొందించుకోవాలని.

సా: పెద్దమ్మా! మీరు ఓ ఫిలాసఫర్‌లా మాట్లాడుతున్నారు. కాని నేనేమో చిన్న పిల్లవాడిని. నాకేమీ అర్థం కావట్లేదు. అర్థం చేసుకోవడం కష్టంగా వుంది.

సిం: అవునా! సరే... అయితే. మరో కోణంలో మాట్లాడుకుందాం. నీకు ఆది మానవుల గురించి తెలుసు కదా? వాళ్ళు ఎలా ఉండేవారో, ఏం చేసేవారో, ఏం తినేవారో కూడా తెలుసు కదా? నాగరికత ఎలా అభివృద్ధి చెందిందో అదీ తెలుసు కదా!

సా: తెలుసు... తెలుసు. వారు అడవుల్లోనే ఉండేవారు కదా! వారి ఆహారం ప్రకృతిలో లభించే ఆకులు, అలములు, పండ్లు... ఇవే కదా! క్రూర జంతువులు తిని వదిలేసిన ఆహారం మీద కూడా ఆధారపడే వారు కదా?

మ: అవును. తర్వాత తర్వాత మెల్లమెల్లగా పంటలు పండించడం నేర్చుకొన్నారు. దాంతో వారి సాంఘిక జీవనం ప్రారంభమైంది కదా! నదీ తీరాలలో నివసించడం ప్రారంభించారు. ఇంకా చెప్పాలంటే నీటి వసతి ఎక్కడుంటే అక్కడ నివసించడం అలవాటు చేసుకున్నారు కదా పెద్దమ్మా!

సా: అంటే... నదీతీరాలే కాకుండా కాలువలు, సరస్సులు, కుంటలు, గుంటల ప్రక్కన కూడా కదా? (అందరూ నవ్వుతారు).

వి: మీరు చాలా విషయాలు తెలుసు. ప్రారంభం నుంచే మానవులు సహజ వనరులపై ఆధారపడి జీవిస్తున్నారని మీకిప్పటికే అర్థమయింది కదా! అడవుల్లో నివసించేటప్పుడు సహజంగా లభించే పండ్లు, దుంపలనే ఆహారంగా తీసుకునేవారు.

భా: గమనించాల్సిన విషయం ఏంటంటే, వారికి ఎంతవరకు అవసరమో అంతే సేకరించుకొని వినియోగించుకొనేవారు కదా విజయ్! వారికున్న జ్ఞానం తక్కువ. ఆ కారణంగా మూఢ నమ్మకాలు ఏర్పరచుకున్నారు. అద్భుతాలు ఏవో జరుగుతాయని నమ్మారు కాని ప్రకృతి పట్ల మాత్రం ఆరాధ్య భావంతో, విధ్వంసం చేయకూడదనే తత్వంతో వుండేవారు.

సా: అంటే మనలాగా మాత్రం కాదు.

సిం: అవును. ఆసక్తికరమైన అంశం ఏంటంటే... ప్రకృతంతా మానవులకు దేవుడిచ్చిన అద్భుతమైన బహుమతిగా భావించి, ప్రకృతిని దేవుని యొక్క ప్రతిరూపంగా తలంచి కొలిచేవారు. అందుకే భూదేవత లేదా భూమాత లాంటి పదాలొచ్చాయి. నాలుగు వేల సంవత్సరాల నుండి ఈ భావజాలం నడుస్తూనే వుంది.

సా: నిజమేనా? దేవుడిచ్చాడా?

సిం: నిజంగా దేవుడిచ్చాడా లేదా అనేది కాదు మన చర్చ. ఆ విధంగా నమ్మి, ఆరాధించి, ప్రకృతిని కాపాడుకునే వారు. ప్రకృతితో కలిసి జీవించేవారు.

వి: మీ పెద్దమ్మ చెప్పింది అక్షరాల నిజం. ప్రకృతిలోని గ్రహాలను, జంతువులను, చెట్లను,

నదులను, సముద్రాల్ని దేవుళ్ళు, దేవతలుగా చూడడం మన సంప్రదాయం.

మ: అందుకే కదా.. మన దేశంలో రాళ్ళను, రప్పలను పూజిస్తారు. అది మన సంస్కృతిలో భాగం అయిపోయింది కదా!

భా: అవును. చక్కగా అర్థం చేసుకున్నావ్! వ్యవసాయం నేర్చుకున్నాక సంచార జీవనాన్నుంచి స్థిర నివాసం వైపు మరలారు. వ్యవసాయం ద్వారా ఆహారం మిగులొచ్చింది. మిగులు ఆహారం కారణంగా తీరిక సమయం లభించింది. విశ్రాంతి దొరకటంతో హస్తకళలు అభివృద్ధి చెందాయి. చేతివృత్తులు వచ్చాయి. వ్యాపారం ప్రారంభమయింది.

సా: ఇన్ని విషయాలు నీకెలా తెలుసమ్మా? (ఆశ్చర్యంతో)

భా: చదివి తెలుసుకున్నా.

వి: చరిత్రకు సంబంధించిన మంచి పుస్తకాలు, రచనలు చదివి ఆయా కాల పరిస్థితులను తెలుసుకోవాలి.

సా: పుస్తకాలు మంచి స్నేహితులని మా టీచరు చెప్తుంటుంది. (అందరూ గొల్లున నవ్వుతారు).

సిం: ఎగ్జాక్ట్లీ! అమ్మ చెప్పినవన్నీ వాస్తవాలు. పాతతరంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణి, సర్దుబాటు తత్వం అలవడ్డాయి. వృధా లేదు. దాంతో మంచి పర్యావరణ వ్యవస్థను నెలకొల్పగలిగారు. ఆరోజుల్లోనే మంచి మన్నికైన అభివృద్ధి జరిగిందన్నది నిఖార్సయిన నిజం.

భా: ప్రపంచ నాగరికత లన్నింటిలో మానవునికి ప్రకృతికి మధ్య ఒక అవినాభావ సంబంధం ఉండేది. భూమిని భూమాతగా, భూదేవిగా కొలిచేవారు. వారి పండగల్లో, నాట్యాల్లో, సంగీతంలో, ఆచార వ్యవహారాల్లో అది ప్రతిబింబించేది. ఇప్పటికీ మనం గిరిజన తెగల్లో ఈ పరిస్థితులను గమనించవచ్చు.

వి: వేదకాల రచనల్లో ఇలాంటి అంశాలు పొందుపరిచారు. నేను మీకు చెప్పిన వేదకథల్లో ఈ అంశాలున్నాయి గుర్తించారా? ఉదాహరణకు శకుంతల దుష్యంతుల కథ గుర్తుందా?

సా: అవునవును నాన్నా! నాకు గుర్తుంది. శకుంతల పశుపక్ష్యాదులతో ఆశ్రమంలో ఆడుకుంటుండేది. అడవి జంతువులతో కూడా ఆమెకు స్నేహం ఉండేది.

భా: ఆ కథ నుంచి మీకేమర్థమయింది? నాడు వ్యక్తులు ప్రకృతిలోని ప్రతిదాన్నీ ప్రేమించేవారు. ప్రకృతితో కలిసి పోయేవారు. వన్యప్రాణుల పట్ల ప్రేమగా వ్యవహరించేవారు.

మ: ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలనేకం వన్యప్రాణుల సంరక్షణ కొరకు పనిచేయాల్సిన దుస్థితి ఉందికదా ఇప్పుడు. మీరు చెప్పేదాన్ని బట్టి ఆరోజుల్లో వన్యప్రాణులను కాపాడడం, సంరక్షించడం సహజమైన బాధ్యతగా భావించినట్లున్నారు. వాటిని తమలో భాగంగా చూచారు.

వి: అవునమ్మా మనస్వీ! ఈ లక్షణం మన రక్తంలోనే వుంది. మన పూర్వీకులు అడవులను, జంతువులను, జలాలను, పశుపక్ష్యాదులను, చెట్లను, పుట్టలను, కొండ కొలనులను ఇలా అన్నింటిని సంరక్షించేవారు. ఆచార వ్యవహారాలలో కళ–సంస్కృతిలో, ఆటపాటల్లో, పండగ పబ్బాలలో వీటిని వ్యక్తపరచేవాళ్ళు.

భా: అవును. మన ప్రాచీన గ్రంథాలు తిరగేస్తే ఈ విషయాలే కనిపిస్తాయి. ప్రకృతికి, మానవునికి ఉన్న అవినాభావ సంబంధాన్ని చక్కగా పొందుపరచారందులో. ఈ భూమిపై జీవించే హక్కు అన్ని ప్రాణులకు ఉందనేదే వారి భావన. ఇతర ప్రాణుల మనుగడను ఎవరూ దెబ్బతీసేవారు కాదు.

సిం: ఒక్క జీవులకు, మనుషులకూ మధ్యనేనా ఈ సంబంధాలు అంటే ప్రకృతిలోని ప్రతిదీ, ప్రతిదానితో మమేకం కావాలి. అన్నీ పరస్పరాధారితాలు.

వి: అవును. ఇదే విషయాన్ని మధ్య యుగాల నాటి కాళిదాసు మహాకవి ప్రకృతితో వున్న సెంటిమెంట్స్‌ని చక్కగా, అందంగా వర్ణించాడు తెలుసు కదా!

మ: మేఘసందేశం గురించేనా మీరు మాట్లాడుతోంది. నా స్నేహితురాలు చెప్పిందో సారి. అదో గొప్ప కావ్యమట కదా! ప్రేమకావ్యమట. మేఘాలనే రాయబారిగా చేస్తూ రచించారట. అందుకే దానిని గొప్పకావ్యమన్నది.

సా: నాన్నా..నాన్నా! మీరు మేఘాలంటున్నారు. బయటకూడా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. వాతావరణమే మారిపోయి ఉంది. రండి బయటకు వెళ్ళి ఆస్వాదిద్దాం.

మ: అవునమ్మా... వెళ్దాం బయటకు.

సిం: మంచి సలహా ఇచ్చార్రా మీరు. బయట కూర్చొని మాట్లాడుకుందాం. బాగుంటుంది. ఇలాంటి ఆహ్లాదకర వాతావరణం ఎప్పుడోగాని లభించదు.

(దృశ్యం మారు)

(తలుపులు తెరచిన శబ్దం. కుర్చీలు తీసుకెళ్తున్న శబ్దం. పక్షుల కిలకిలారావాలు, చిన్న చిన్న అరుపులు, కేకలు).

మ: అమ్మా! నువ్వు కాళిదాసు గురించే కదా మాట్లాడుతుంది. ఇంతకీ ఏం చెప్పాలనుకున్నావ్?

భా: అవును. కాళిదాసే మరో గ్రంథం వ్రాశాడు. అది 'అభిజ్ఞాన శాకుంతలం'. ఇది శకుంతల, దుష్యంతుల మధ్య ప్రేమ కావ్యం. వారిద్దరి కుమారుడే భరతుడు. ఈ దేశాన్ని ఐకమత్యం చేసిందతనే. మన దేశానికి భారతదేశం అని అందుకే పేరొచ్చింది.

సా: వావ్! నిజంగా? భలే కథ! నాన్నగారు మాకు దాన్ని అద్భుతంగా వినిపించారు.

సిం: అదే కాదు. మరెన్నో అద్భుతమైన గ్రంథాలున్నాయి. మానవ సంబంధాలు, స్నేహం లాంటి అంశాలపై చక్కని కావ్యాలున్నాయి.

సా: ఏంటి పెద్దమ్మా! మీరేంటో సంబంధాలూ.. పుస్తకాలంటున్నారు.

సిం: అవును. పంచతంత్రం, బోధిసత్వుని జాతక కథలు లాంటివి మంచి మంచి పుస్తకాలు. మనుషుల మధ్య సంబంధాల గురించి అద్భుతంగా చెప్తాయి.

వి: అంతేకాదు. మనుషులకు, జంతువులకు మధ్య నుండే సంబంధాలను తెలిపే చిత్రాలు కూడా ఉన్నాయి. భీం భేటికా పేరు విన్నారా?

మ: ఎక్కడో విన్నట్లుంది నాన్నా..!

సా: నేనైతే వినలేదు.

భా: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు 10-15 కి.మీ. దూరంలో భీంభేటికా అనే ఊరుంది. అక్కడ ఆది మానవులు నివసించిన అద్భుతమైన గుహలున్నాయి. అదే భీంభేటికా.

వి: ఆదిమానవులు గోడలపై ప్రకృతి రంగులు ఉపయోగించి గీసిన చిత్రాల్లో ఎక్కువగా జంతువుల బొమ్మలు, వాటితో మానవులకున్న సంబంధాలను తెలిపేవే.

సిం: అయితే ఇది కేవలం మన దేశంలోనే కాదు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో నాగరికతలలో ప్రకృతిలోని పుట్టలకు, గుట్టలకు, పశుపక్ష్యాదులకు, సూర్యచంద్రులకు, చెట్టుచేమలకు, రాయిరప్పలకు, నదీనదాలకు పూజలు చేసేవారు. ఇలా అన్నింటిని పూజించే సంస్కృతి ఉండేది. వీటన్నింటిని మహాశక్తులుగా కొలిచేవారు. ఇప్పటికీ అదే పరంపర కొనసాగుతున్నది.

భా: మీకు తెలుసు కదా కన్నా! మన దేశంలో దేవుళ్ళకు, దేవతలకు ప్రతిరూపాలుగా ఆపాదిస్తూ అనేక వస్తువులు, జంతువులు, చెట్లు, ఆయుధాలు, సంగీత వాయిద్యాలు, రంగులు చూస్తుంటాం.

సిం: అలాగే కొన్ని జంతువులను, పక్షులను, చెట్లను దేవుళ్ళకు, దేవతలకు ప్రతిరూపాలుగా భావించి పూజిస్తూ సంరక్షిస్తుంటారు తెలుసు కదా!

సా: అవును పెద్దమ్మా! గోవులను, రావిచెట్లు, వేపచెట్లను పూజించడం, సంరక్షించడం చూస్తున్నాం.

భా: మన దేశంలో కేవలం చెట్లను, జంతువులు లాంటి వాటినే కాదు, అడవులను కూడా దేవతా వనాలుగా భావించి కొలుస్తూ, కాపాడుతుంటారు. ఇలాంటివి మన దేశంలో వందలకొద్దీ ఉన్నాయి.

సిం: అవునవును మంచి విషయమిది. అడయార్‌లోని మర్రిచెట్టు విస్తరించిన ప్రాంతం, అనంతపురంలోని పిల్లలమర్రి ప్రాంతం, ఢిల్లీ సమీపంలోని గుర్‌గావ్ ప్రాంతంలో ఆరావళి పర్వత శ్రేణులలో బంగార్ బని లాంటివి వున్నాయి.

మ: అవనమ్మా, నేనూ విన్నాను. మా టీచర్ చెప్తుంటారు.

వి: అవును. అదొక దేవతావనం.

సిం: దేశవ్యాప్తంగా దేవతవనాలు అనేకం ఉన్నాయి. దేవరహట్టి పేరుతో మహారాష్ట్రలో, ఔరన్స్

అని రాజస్థాన్‌లో, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్‌లలో సార్నా పేరుతో, కాబూ పేరుతో కేరళలో, కొవెల్‌కైడు పేరుతో తమిళనాడులో, లాయి ఉమాంగ్ పేరుతో మణిపూర్‌లో అటవీ ప్రాంతాలు కాపాడబడుతున్నాయి.

వి: ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఒక్క కర్ణాటక రాష్ట్రంలనే 1424 దేవతా వనాలున్నాయి. స్థానికులు వాటిని నాగవనాలని, లేదా దేవరకడ్డు అని పిలుస్తుంటారు.

మ: ఈశాన్య రాష్ట్రాలలో కూడా ఇలాంటివి వున్నాయా నాన్నా?

సిం: మంచి ప్రశ్న! ఈశాన్య రాష్ట్రాలలో దట్టమైన అడవులున్నవన్న విషయం నీకు తెలుసు. మేఘాలయ రాష్ట్రంలోని జయంతి పర్వత శ్రేణిలో 'రావ్లా-బలాయ్' అనే పేరుతో 30 ఎకరాలలో విస్తరించి ఉన్న అటవీ క్షేత్రం.

వి: మరో ఆశ్చర్యం గొలిపే అంశం ఏంటంటే ఈ అడవిలోని ప్రజలు చెప్పులు కూడా ధరించరు.

సా: అవునా... చెప్పులు లేకుండానా? బాప్‌రే!

మ: భక్తిభావంతో అడవుల్ని చూస్తున్నారనే కదా!

సిం: అడవుల్ని సంరక్షించటానికే ఇలాంటి సాంఘిక నియమాలను రూపొందించుకున్నారు. ఆనాటి సమాజం దూరాలోచనతో చేసిన నిర్ణయాల కారణంగా ఆ తోటలు, అడవులు నేటికీ సంరక్షించబడుతున్నాయి.

వి: నా చిన్నతనంలో ప్రతి గ్రామానికి వనం అనో, తోపు అనో, తోట అనో వృక్ష సముదాయం వుండేది. నేడు కనుమరుగై పోయాయి.

సిం: సంరక్షించబడిన వనాల్లో వివిధ రకాల క్రిమికీటకాలు, పక్షులు, వన్యప్రాణులు ఉండేవి. వీటిల్లో మహా మహావృక్షాల నుండి అందమైన రంగురంగుల పొదలు, గుట్టలు, నేలకు అల్లుకుపోయిన తీగమొక్కలు ఉండేవి.

వి: ఈరోజు మనమందరం 'బయోడైవర్సిటీ' అని అంటున్నామే, మనకన్నా మన పెద్దలే ఆరోజుల్లో ఆచరణలో చూపారు. దానికి ప్రాధాన్యతనిచ్చారు. శాసనాలు కూడా చేశారు.

మీకు అశోకుడి గురించి తెలుసు కదా!

మ: రోడ్ల కిరువైపులా అశోకుడు చెట్లు నాటించాడని చరిత్ర పుస్తకాల్లో చదివాము నాన్నా.

వి: అవును.

సా: బాటసారులకు నీడనివ్వడానికి చెట్లు నాటాడు కదా!

వి: అవును. నేటికి కూడా వాటిని చూడొచ్చు.

భా: రోడ్డు విస్తరణల పేరుతో వందల ఏళ్ళనాటి చెట్లను కూల్చేస్తున్నారు. బాధేస్తుంది.

మ: మమ్మీ! కూల్చేయడ మెందుకు. చైనాలో మాదిరి చెట్లను పెకలించి తీసుకెళ్ళి ఖాళీ ప్రదేశాలలో పెట్టొచ్చు కదా!

సా: 'వాట్సప్'లో విడియో చూశాం కదా అక్కా! వాటి కోసం యంత్రాలు కూడా వచ్చేశాయి.

భా: పర్యావరణాన్ని, భూఆవరణాన్ని, వన్యప్రాణులను, అడవులను సంరక్షించడం కోసం రాజులందరూ శాసనాలు చేయాలని కూడా అశోకుడు ఆదేశించినట్లు చరిత్ర చెబుతోంది. శాసనాల్లో కూడా చూడొచ్చు.

వి: ప్రపంచంలో మరెక్కడా ఏ పరిపాలకుడు కూడా అశోకుడి మాదిరి ఇలాంటి శాసనాలు చేసినట్లు ఆధారాలు లేవు.

సా: ఒకే ఒక్కడన్న మాట.

భా: భారతీయ అర్థశాస్త్ర మూలపురుషుడిగా కొనాయాడబడే చాణుక్యుని వ్రాతలనుంచి అశోక చక్రవర్తి స్ఫూర్తి పొందాడని చరిత్రకారులు చెప్తుంటారు. తను రచించిన 'అర్థశాస్త్ర' అనే పుస్తకంలో పర్యావరణాన్ని ఎలా సంరక్షించాలి, ఎలా కాపాడుకోవాలి అనేది తెలియపరుస్తూ అతిక్రమించినవారికి జరిమానాలు విధించాలని సూచించాడని చరిత్ర చెబుతుంది.

వి: అలాగే మరో పాలకుడిని కూడా గుర్తుచేస్తా. మరాఠా వీరుడుగా ప్రసిద్ధి చెందిన ఛత్రపతి శివాజి కూడా అలాంటి శాసనాలే చేశాడు. ముఖ్యంగా ఆయన పరిపాలనా కాలంలో నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యత నిచ్చినట్లు తెలుస్తుంది.

మ: అలాగే! మా సాంఘిక శాస్త్ర పుస్తకాల్లో చదివా. మాల్వ పాలకుల కాలంలో రాణి అహల్యాబాయి రహదారుల కిరువైపులా బాటసారులకు చక్కని నీడ కొరకు అశోకుని మాదిరి మొక్కలు నాటించిందట.

సా: నేనుకూడా చదివానక్కా! (నవ్వుతూ)

మ: సార్థక్! గౌతమ బుద్ధుడి గురించి కూడా చదివుంటావ్. 'అహింసా పరమోధర్మః' అని ప్రాణుల పట్ల అత్యంత ప్రేమ ప్రదర్శించాలని హితబోధ చేసినట్లు.

వి: అవును తల్లీ! అహింస అనేది అత్యుత్తమ ధర్మంగా చెప్తూ ఏ జీవినీ హింసించకూడదని బోధించాడు బుద్ధుడు. నేలను, నీటిని, అడవులు సంరక్షించేవిధంగా ప్రజలకు బోధనలు చేయాలని తన శిష్యులకు ఆదేశాలిచ్చేవాడు.

భా: జైనమతం కూడా అంతే కదా! ఇంకా మనం చూస్తే ఆ మతం, ఈ మతం అన్న తేడా లేకుండా అన్ని మతాలు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిచ్చాయి. పర్యావరణ పరిరక్షణలోనే మానవ కళ్యాణం ఉందని బోధిస్తాయి.

సిం: పిల్లలూ! మీరు రాజస్థాన్‌లోని వైష్ణోవి సమాజ్ గురించి విన్నారా?

సా,మ: ఊహూఁ! (తలలు అడ్డంగా ఆడిస్తూ)

సిం: రాజస్థాన్‌లో ఖిజార్లి అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఉండే వైష్ణోవి సమాజ్‌కు చెందినవారు ఆ ప్రాంతంలోని చెట్లను, జంతువులను కాపాడుకోవడం కోసం ప్రాణాలు కూడా ఇచ్చారు. నిజంగా వాళ్ళు గొప్పవాళ్ళు.

సా: పెద్దమ్మా! ఇంకొంచెం వివరంగా చెప్పరా?

సిం: అది జోథ్‌పూర్ కోట నిర్మించే కాలం. కోట నిర్మాణానికి అవసరమైన సున్నం తయారి కోసం వేసుకున్న బట్టీ కాల్చడానికి కలప అవసరమైంది. ఆ కలపని సమీప ఖేజార్లీ గ్రామం నుంచి తెమ్మని రాజుగారు ఆదేశించారు. భటులెళ్ళి ఆ గ్రామ పొలాల్లో ఉన్న చెట్లను నరకడం ప్రారంభించారు. ఇది గమనించిన అమృతాదేవి అనే మహిళ భటులను వారించింది.

సా: ఏమని?

సిం: చెట్లను నరకొద్దని. భటులు లెక్కచేయలేదు. దాంతో గ్రామానికి వెళ్ళి గ్రామస్తుల నందరిని తెచ్చి చెట్లకు అడ్డంగా నిలబెట్టింది. అయినా జవాన్లు లెక్కచేయకుండా అడ్డంవచ్చిన వారినందరిని ఊచకోత కోశారు. అనేకమంది ప్రాణత్యాగం చేసిన సంఘటన అది.

మ: చెట్ల కోసం ప్రాణత్యాగం. నిజంగా అద్భుతం. గొప్ప ప్రాణత్యాగం.

వి: ఇలాంటి సంఘటననే మనం ఆధునిక భారతదేశంలో చూడొచ్చు. గద్వాల్ ప్రాంతంలో జరిగిన చిప్‌కో అంటే ఆలింగన ఉద్యమం. తేహ్రి గ్రామానికి చెందిన గౌరిదేవి డ్యామ్ గుత్తేదార్లు అడవిని నరుకుతుంటే ఒప్పుకోలేదు. చెట్లను ఆలింగనం చేసుకొని గుత్తేదారులను తరిమికొట్టండని పిలుపునిచ్చింది. అందుకే ఈ ఉద్యమానికి ఆ పేరు పెట్టారు.

భా: అయితే అడవుల నరికివేత ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది (నిరుత్సాహంగా). అలాంటి ఉద్యమాలు అవసరం అనిపిస్తున్నది. ప్రకృతిని, పర్యావరణాన్ని సంరక్షించుకోవాలటే దృఢచిత్తం, పట్టుదల, ధైర్యం కావాలి.

సిం: చండీ ప్రసాద్ భట్, సుందర్‌లాల్ బహుగుణ లాంటి పర్యావరణవేత్తలు ఇప్పటికే ఈ దిశలో చాలా కృషిచేస్తున్నారు.

వి: ఈ రంగంలో ఇప్పటికే చాలామంది పనిచేస్తున్నారు. నేల, నీరు, గాలి, ప్రకృతి వనరుల విలువ ఇప్పుడిప్పుడే ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కాని సంరక్షణ దిశలో అడుగులు పడటం లేదు.

భా: మన దేశంలో ప్రాచీన కాలంనుంచి నీటిని సంరక్షించే పద్ధతులు సంస్కృతిలో భాగంగా ఉన్నాయి. ప్రతి నీటి బిందువుని ఒడిసి పట్టుకోవడం కోసం కుంటలను, గుంటలను, చెరువులు, దొరువులు ఇలా అనేక రకాల పద్ధతులు గుర్తించారు. నదులను దేవతలుగా పూజించడం మనకు తెలుసు కదా!

మ: గోదావరి తల్లి, కృష్ణ మాత... ఇలా కదా?

భా:	అవును. నదీజలాలను పవిత్ర జలాలుగా భావిస్తారు. ముఖ్యంగా దక్షిణ భారతీయులు, ఉత్తర భారత దేశ నదుల నీటిని తెచ్చి ఇళ్ళల్లో దాచుకొని పూజిస్తుంటారు. అది మన ప్రజల మైండ్‌సెట్.

మ:	(నవ్వుతూ) అమ్మా! నీకు కూడా సమయం అయ్యింది. నీ మైండ్‌సెట్ మార్చుకొని పలహారం అందించాలి మాకు.

సా:	వావ్! అక్కా! బాగా గుర్తు చేశావ్! మొదటిసారి మంచిగా అడిగావ్ అక్కా! (నవ్వుతూ)

భా:	ఓకే... అలాగే! కొంచెం ఒపిక పట్టండి. మీకిష్టమైన పలహారం తెస్తా!

వి:	వినంద్రా! మన సంస్కృతి ఆచారాలలో ఆహార వృథా అనేదే లేదు. ఒక్కో ధాన్యం గింజని కూడా జాగ్రత్తగా దాస్తాము. పొలాల్లో వదిలేసిన ధాన్యం గింజలని సేకరించుకొని జీవించిన వ్యక్తిగా కన్నడ ఋషికి గుర్తింపు. 'కన్' అంటే ధాన్యం. దానినుంచే ఆ ఋషికి కన్నడ అని పేరొచ్చింది. ప్రతి ధాన్యపు గింజా అత్యంత విలువైనదే అని సందేశం ఇచ్చే తార్కాణమే 'కన్నడ'.

మ:	నాన్నా! మన సార్థక్ ఈ విషయం గ్రహించాలి. భోజనం చేసేటప్పుడు ఆహారాన్ని వృథా చేస్తుంటాడు. అల్పాహారం కూడా పూర్తిగా తినడు.

సా:	అక్కా! నీకెప్పుడూ నా గొడవే. నన్ను తిట్టిస్తే గాని నీకానందంగా వుండదు.

వి:	సార్థక్! అక్క ఉద్దేశ్యం అదికాదు. తమ్ముడు బుద్ధిమంతుడుగా ఉండాలని అక్క కోరుకుంటుంది. నీకోసమే కదా! నీకే కదా మంచి పేరు.

సిం:	మనస్వినే కరెక్ట్! ఎవరూ ఆహారాన్ని వృథా చేయకూడదు. ప్రతి ధాన్యపు గింజ అత్యంత విలువైనదే. లక్షలాది మంది అర్థాకలితోనే జీవిస్తున్నారు. పస్తులతో పడుకొంటున్నారు.

వి:	నేనో పుస్తకంలో చదివా. లండన్ నగరంలోని హోటల్స్‌లో చేసే ఆహార వృథాతో సబ్‌సహారా దేశంలోని ప్రజలకు నెలకు సరిపడా ఆహారం లభిస్తుందట.

సా:	అవునా?

మ: మీరన్నట్లు మనదేశ సంస్కృతిలో ఆహార వృథా లేనట్లయితే, అంటే మన పూర్వీకులు దయగల వారైతే మన దేశంలో ఇన్ని అంతరాలేమిటి? అందరికీ సమానంగా ఆహారం లభించాలి కదా!

సిం: పెద్ద ప్రశ్న! మంచి ప్రశ్న! ఈమధ్య కాలంలో వచ్చాయీ అంతరాలు. ఇప్పుడు సమాజంలో వినిమయ సంస్కృతి, వ్యక్తిగత ధోరణి, సహజ వనరులు కొంతమంది చేతుల్లోకి వెళ్ళిపోవడంతో అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వి: ఇది మన దేశంలోనే కాదురా! ప్రపంచవ్యాప్తంగా ఉంది.

సిం: అవును. ప్రజల ధోరణి మారాలి. ఓకే...! మీ పలహారం వచ్చినట్లుంది. (నవ్వుతూ).

(ప్లేట్లు, కప్పులు, నీళ్ళ శబ్దం)

వి: ఈ అసమానతలు పెరగకుండా....

సా: (మధ్యలో కలగజేసుకుంటూ) నాన్నా! ముందు మన ఆకలి తీర్చుకొని ప్రపంచం ఆకలి గురించి ఆలోచిద్దాం...!

(అందరూ గొల్లున నవ్వుతారు)

మ: ఈ ధోరణే మారాలని పెద్దమ్మ చెప్తున్నది.

సిం: మీకిక్కడ "ఉబంతు" భావజాలం గురించి చెప్పాలి. తింటూ వినండి.

సా: ఉంబతునా?

మ: ఎక్కడో విన్నట్లుందే!

సిం: ఇదొక ఆఫ్రికన్ ప్రజల భావజాలం. కుటుంబంలో గాని, స్నేహితులకు గాని ఆహారం లభిస్తే వెంటనే తినేయరు. అందరూ కలసి కూర్చొని పంచుకొని తింటారు. అందరూ బాగుంటే, మనమూ బాగుంటాం అనేది వారి ఉద్దేశ్యం.

మ: నిజంగా గ్రేట్! మా సార్థక్ తీరుకి వ్యతిరేకం.

భా: నేర్చుకుంటాడు లే.

వి: ఈ అసమానతలను పారద్రోలటానికే "నిలకడైన అభివృద్ధి" అనే మంత్రం

ముందుకొచ్చింది. దీనిద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినని అభివృద్ధి కావాలి అని ప్రజలు కోరుకుంటున్నారు.

సిం: ఇదేమీ సులభ పరిష్కారమున్న సమస్య కాదు. ఇదో బాహుబలి సమస్య. పర్యావరణ సమస్యలు తగ్గించే దిశలో చర్యలకు ఉపక్రమించాం. ఈ ప్రయత్నంలో భాగంగా 1992లో స్టాక్‌హోంలో పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలతో బ్రెజిల్‌లోని రియో-డి-జెనెరియోలో మహా సదస్సు జరిగింది. భూగోళం వేడెక్కుతుండటంపై ప్రధాన చర్చ జరిగింది. ఈ సదస్సు తర్వాతే మన్నికైన అభివృద్ధి అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది.

వి: వదినా! ఈ సదస్సులోనే కదా ప్రాచీన నాగరికతల్లో, సంస్కృతుల్లోని అంశాలను పర్యావరణ పరిరక్షణ కోసం ప్రచారం చేయాలని తీర్మానించారు.

సిం: అవును. నిజమే.

వి: నిజానికి అన్ని నాగరికతల్లో పర్యావరణం-పరిసరాలతోమానవ సంబంధాలు గొప్పగా వున్నాయి. మానవ భావజాలమే పర్యావరణాన్ని కాపాడగలదు. పర్యావరణాన్ని సంరక్షించుకోవడమంటే మన జీవన విధానాన్ని మెరుగుపరచుకోవడమనే అర్థం.

సిం: ఒక్క విషయం మాత్రం సుస్పష్టంగా చెప్పగలను. ఈరోజు ప్రపంచమంతా ప్రాచీన భారతీయ నాగరికత - సంస్కృతి వైపు చూస్తున్నది. ఇది మన్నికైన అభివృద్ధికి దోహదం చేస్తుందని అభిప్రాయ పడుతున్నారు.

భా: కాని మనమే మన సంస్కృతి, వారసత్వాన్ని మరిచిపోతున్నాం.

వి: భారతీ! నిజమే. కాని సింధుగారు చెప్పింది అక్షర సత్యం. మన ఆచార వ్యవహారాలు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసేవే. వాటిని అలవరచుకుంటే మన్నికైన అభివృద్ధిని సాధించవచ్చు.

సిం: అవును విజయ్! పాత చింతకాయ అని దేన్నీ తీసేయకూడదు. పాతలోని మంచిని స్వీకరించాలి. మన అనుభవాలు మనకు గుణపాఠాలు నేర్పిస్తాయి. అభివృద్ధి చెందిన సమాజాలే అభివృద్ధికి మార్గాలు చూపిస్తాయి. వాటినే పాటించాలి అనే దృక్పథం విడనాడాలి.

మన్నికైన అభివృద్ధి కోసం ఎక్కడ మంచి అనుభవాలున్నా స్వీకరించి అమలు చేయాలి. అప్పుడే అందమైన, మన్నికైన భవిష్యత్తు ఉంటుంది.

వి: బాగా చెప్పారు. ఇక్కడ మన మహాత్మ గాంధీ మాటలు గుర్తుచేసుకోవాల్సి వుంది.

సా: బాపూజీ ఏంచెప్పారు నాన్నా?

వి: ప్రకృతిలోని వనరులన్నీ మన అవసరాలను తీర్చడానికే గాని అత్యాశల్ని తీర్చడానికి కాదని.

మ: (చప్పట్లు కొడుతుంది). (అందరూ చప్పట్లు కొడతారు).

భా: అత్యాశల్ని మనుషులు వదులుకోవడం సాధ్యమా?

వి: తప్పదు. భవిష్యత్తు బంగారంగా ఉండాలంటే కొన్ని త్యాగాలు తప్పవు.

సిం& భా: అర్థమైంది కదర్రా! మానవ మనుగడ కొనసాగాలంటే, బంగారు భవిష్యత్తును కోరుకుంటే రాబోయే తరాలకు అందమైన, ఆహ్లాదకరమైన, నివాసయోగ్యమైన భూమిని అందించాలంటే గాంధీగారి మాటల్ని మరువకూడదు.

వి: బ్రతుకు-బ్రతికించు అనేది నినాదంగా మారి ప్రజలు చైతన్యం కావాలి.

సా& మ : అవును నానా!

సిం: విధ్వంసమైన పర్యావరణాన్ని తిరిగి గాడిలో పెట్టాలి. "అవనికి వసంతం" రావాలి. అప్పుడే "సర్వేజనాః సుఖినోభవంతు".

-o0o-

**క్విజ్ :**

**ప్ర.1: ఢిల్లీకి సమీపంలో ఉన్న దేవతావనం పేరేమిటి?**

**జ : గురుగావ్-ఫరీదాబాద్ రహదారిలోని బంగార్‌బని.**

**ప్ర.2: ఖేజార్లీ గ్రామం ఎక్కడుంది? దానితో గుర్తుకొచ్చే అంశం ఏమిటి?**

**జ : రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ దగ్గర. అమృతాదేవి అనే ఆమె తన అనుచరులను చెట్లను కాపాడాలని ప్రయత్నిస్తే సైన్యం వారిని చంపేయడం.**